మృగాళ్లున్నారు జాగ్రత్త

కామం కళ్లనే కాదు మెదడునూ మూసేస్తుంది... వావీ, వరసలు కన్పించకుండా చేస్తుంది కోరిక మనిషినే కాదు... మానవత్వాన్ని చంపేస్తుంది... చిన్నా, పెద్దా గౌరవాలను తుంచేస్తుంది... దుర్మార్గపు ఆలోచన మృగాళ్లుగా మారుస్తోంది... స్త్రీలైతే చాలు పసి పిల్లలు, వృద్ధులనే తేడా లేకుండా కాటేస్తోంది. ఆ దుర్మార్గుల మృగాలోచన వారి మెదడును మూసేసింది... మానవత్వాన్ని చంపేసింది... చిన్నారులపై అత్యాచారానికి పురికొల్పింది... మానవీయ విలువలకే సమాధి కట్టే... మనుషులమేనా అని అనుమానమొచ్చే దుర్ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. మృగాళ్ల వాంఛాగ్నిలో చిన్నారులు కలువల్లా కాలిపోతున్నారు.

ఈ చిత్రంలో వ్యక్తి మదనపల్లె పట్టణంలోని ఓ కాలనీకి చెందిన రమేష్ అలియాస్ తిరుపతి (41). 2017లో ఓ బాలికపై అత్యాచారానికి యత్నించడంతో పాటు చిన్నారిపై దాడి చేసి గాయపరిచాడు. అప్పట్లో పోలీసులు నిందితుడిని అరెస్టు చేయడంతో ఇటీవల చిత్తూరు పోక్సో కోర్టు న్యాయ మూర్తి నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

● చిన్నారులను చిదిమేస్తున్నారు ● పెరుగుతున్న అఘాయిత్యాలు



మనతోనే ఉంటారు... పక్కనే తిరుగుతుంటారు...
కరుణను కురిపిస్తుంటారు... ప్రేమగా మాట్లాడుతుంటారు...

మన వాళ్లేనని నమ్మారో ఇక అంతే సంగతులు
ఆడ పిల్లలున్న తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త మృగాళ్లున్నారు

చాక్లెట్ కొనిస్తానని నమ్మించి నలిపేయాలని ప్రయత్నించాడొకరు
చిన్నారన్న కనికరం కూడా లేకుండా లైంగిక దాడికి పాల్పడ్డాడు మరో నీచుడు

ఎనిమిదేళ్ల బాలికపై హత్యాచారానికి తెగబడ్డాడో దుర్మార్గుడు
చదువుల గుడిలోనే ప్రిన్సిపల్ భర్త రూపంలో కాటేయాలని చూశాడో కామాంధుడు.

ఇలా అడుగడుగునా మృగాళ్లు చిన్నారులను కాటేస్తున్నారు.
తాజాగా వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలంలోని ఓ గ్రామంలో వరుసకు చిన్నాన్న అయిన వ్యక్తి కూతురి లాంటి ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు.

ఇలా ఒకటి... రెండు కాదు.. ఇరు జిల్లాల్లో చిన్నారులపై రోజు రోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ఓ వైపు శిక్షలు పడుతున్నా కామాంధులు కళ్లు తెరవడం లేదు. లైంగిక దాడులతో చిన్నారుల జీవితాలను చిద్రం చేస్తున్నారు. కొంతమంది బయటకు చెప్పుకుంటే మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పరువు పోతుందని, పిల్లలు బయట తిరగడం కష్టం అవుతుందని ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఇలాంటి కామాంధుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులపై కఠినంగా వ్యవహరించాలని, ఉరి వేసేలా కఠిన శిక్షలు అమలు చేయాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి.

ఇటీవల నమోదైన పోక్సో కేసుల వివరాలివి

● 2023 జూన్ 2న ప్రొద్దుటూరులో తొమ్మిదేళ్ల బాలికపై వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలికలో మార్పులు కనిపిస్తుండడంతో తల్లిదండ్రులు గుర్తించడంతో విషయం బయటికి వచ్చింది. దీంతో ఆ కామాంధుడిపై కేసు నమోదు చేశారు.

2024 ఆగస్టు 7న ఒకే ప్రాంతానికి చెందిన బాలిక, యువకుడు కడపలో చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలికను యువకుడు ఓ గదిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం అలస్యంగా వెలుగులోకి రావడంతో యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.

● 2024 ఫిబ్రవరి 18న ప్రొద్దుటూరులో బాలికపై అయిదుగురు అత్యాచారం చేశారు. పోలీసులు వారందరిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.

● మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని ఓ కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలికపై అదే ప్రాంతంలో ఉండే యువకుడు అత్యాచారానికి యత్నించాడు. బాలిక కేకలేయడంతో స్థానికులు అడ్డుకుని అతనికి దేహశుద్ధి చేశారు..

● ఇటీవల లక్కిరెడ్డిపల్లెలోని ఓ బాలికల గురుకులంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ భర్త పూటుగా తాగి వచ్చి అయిదో తరగతి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గతంలో కూడా పది, ఇంటర్ చదివే విద్యార్థుల స్నానాల గదుల్లోకి దొర్జన్యంగా వెళ్లి వారిని నగ్నంగా సెల్‌ఫోన్‌లో చిత్రించినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ప్రిన్సిపల్, ఆమె భర్తతో పాటు మరో ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అలాంటి వారితో భద్రం

అసభ్యంగా మాట్లాడడం, అదే పనిగా చూడడం, విచిత్రంగా వ్యవహరించడం, చరవాణుల్లో విచిత్రమైన సందేశాలు పంపించడం, శరీరంపై వేయరాని చోట్ల చేతులు వేయడం, కావాలనే తాకడం, రెండు అర్థాలు వచ్చే విధంగా మాట్లాడడం తదితర లక్షణాలున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

● చెడు అలవాట్లు ఉండే వారు మద్యం, గంజాయి మత్తులో ఉండే వారు, ఇది వరకే పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు అనుమానాలున్న వ్యక్తులను దగ్గరకు రానివ్వ కూడదు. తమ పిల్లలను చూస్తూ ఉండమని చెప్పి తల్లిదండ్రులు బయటికి వెళ్తారు. పిల్లలను పక్కింటి వారి ఇంట్లో వదిలిపెట్టే ముందు ఒక్కసారి ఆలోచించాలి. తెలిసిన వారు కదా, పైగా పెద్దలు కదా అని నిర్లక్ష్యం చేయరాదు. ఇప్పుడు జరుగుతున్న దారుణాల్లో చాలా వరకు వయసు పైబడిన వారే చేస్తున్నారు. ఒక్కసారి అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

అవగాహనే ముఖ్యం - రమాకాంత్, మహిళా రాణా డీఎస్పీ, కడప

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే విషయాలపై ఎలాగో పాఠశాలల్లో, కళాశాలల్లో అధ్యాపకులు చెబుతుంటారు. కానీ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఇలాంటి వాటిపై పెద్దగా అవగాహన ఉండదు. కావున ఏసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలి. తల్లిదండ్రులు కూడా అవగాహన కలిగి ఉండాలి అప్రమత్తంగా ఉండాలి. తెలిసిన వారే కదా అని మనం నిర్లక్ష్యం వహిస్తే నష్టపోవాల్సి వస్తుంది.

చట్టంలో కఠిన శిక్షలున్నాయ్ - బాలజ్యోతి, న్యాయవాది, మదనపల్లె

పోక్సో (బాలల లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం) కేసు నమోదైతే శిక్షలు కఠినంగా ఉంటాయి. 3 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుంది. దీంతో పాటు ఒక్కోసారి ఉరి శిక్ష, జీవితఖైదు శిక్షలు కూడా పడతాయి. ఈ నేరంలో బెయిలు ఇచ్చే అవకాశం కూడా ఉండదు. ఖచ్చితంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ కేసులను విచారణ చేసేందుకు ప్రత్యేక కోర్టు ఉంది. అందులో బాధితులను విచారణ చేసే సమయంలో చిన్నారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూస్తారు. ఒకసారి కోర్టుకు వచ్చి వివరాలు చెప్పిన తర్వాత చిన్నారి కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం ఉండదు. 18 సంవత్సరాలలోపు పిల్లలపై అఘాయిత్యం జరిగితే పోక్సో కేసులు నమోదు అవుతాయి. 14 సంవత్సరాల లోపు పిల్లలను వక్ర మార్గంలో చూడటం, లైంగికంగా దాడి చేయడం ఈ చట్టంలోకే వస్తాయి.

జగన్‌దంతా భారతీ జపమే

- ఇళ్ల నిర్మాణానికి అదే సిమెంట్
- సర్వరాయసాగర్ నీళ్లు పరిశ్రమకు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి కేంద్రం రూ.32 వేల కోట్లు నిధులిస్తే గత వైకాపా పాలనలో సీఎం జగన్ భారతి సిమెంట్ వాడారే తప్ప ఇళ్లు మాత్రం పూర్తి చేయలేదు... జిల్లాలో ఆయకట్టుకు నీరందించాల్సిన సర్వరాయ సాగర్ భారతి సిమెంటు పరిశ్రమ దాహం తీరుస్తోంది తప్ప చుక్కనీరు పొలాలకు వెళ్లడం లేదు... మాజీ సీఎం జగన్‌దంతా భారతి జపమేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విమర్శించారు. ఆదివారం మొదటి సారి సొంత ఊరైన వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మవరం నుంచి పులివెందుల మీదుగా ప్రొద్దుటూరు వచ్చానని రహదారులు అధ్వానంగా కనిపించాయని చెప్పారు. ప్రధానంగా పులివెందుల నుంచి ముద్దనూరు వరకూ గతుకుల రోడ్డు ఉన్నాయన్నారు. గత అయిదేళ్ల జగన్ పాలనకు దర్పణం పట్టేలా రహదారి ఉందన్నారు. గండికోట నుంచి పిల్లకాల్వలు తవ్వే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. స్వలాభం, ఇసుక వ్యాపారం కోసం అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతోనే కొట్టుకుపోయిందని చెప్పారు. ఇప్పటికీ ఆ ప్రాంతం వారికి పరిహారం, నిరాశ్రయులకు ఇళ్ల ఇవ్వలేదన్నారు. డ్యామ్ పునర్నిర్మించే పరిస్థితి లేదన్నారు. పులివెందుల కళాశాలలో రూ.370 కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని, కళాశాల, వసతి గృహం పూర్తి కాలేదని ఆరోపించారు. పైగా 48 శాతం బోధన సిబ్బంది కొరత ఉందని ఎలా కళాశాల మొదలవుతుందని ప్రశ్నించారు. అయిదేళ్లుగా నిరుద్యోగులను, ప్రజలకు జగన్ మోసం చేశారని, కానీ కూటమి అధికారంలోకి రాగానే 16,500 డీఎస్సీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన జగన్‌కు బుద్ధిచెప్పడానికి ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులిచ్చారన్నారు. జగన్ సొంత జిల్లాలోని ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతమైన లింగాల మండలం పార్నపల్లి వద్ద ఆయనకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రొద్దుటూరులో పౌర సన్మానం చేశారు.

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, పక్కన కూటమి నాయకులు

మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, నాయకులు

టుర్ టుర్... ట్రాక్టర్



గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు కాడెద్దులు ఎక్కువగా కనిపించేవి... బండి కట్టి ఎద్దులను టుర్... టుర్ అని అదిలిస్తూ సాగేవారు. ఇప్పుడు ఆ ఎద్దులు లేకపోవడంతో టుర్ టుర్ కాస్త ట్రాక్టర్‌గా మారింది. చిన్నచిన్న అవసరాలకు ట్రాక్టరుకు ట్రాలీతో వెళ్లడం కష్టంగా మారడంతో కొందరు రైతులు ఎడ్లకు కట్టే బండ్లను వినియోగిస్తున్నారు. చాపాడు మండలం భద్రిపల్లెకు చెందిన రైతు మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారిపై ఎరువు బస్తాలు రైతులతో కలిసి పొలం వద్దకు వెళ్లడం కనిపించింది. ట్రాలీ కంటే ఎడ్లబండి అనువుగా ఉంటుందని రైతు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో రహదారి దుస్థితి

పనులు సాగవు... అవస్థలు తీరవు

కడప నగరపాలక, న్యూస్‌టుడే : అమృత్ నీటిపథకం పనులు కడప నగరవాసులకు చుక్కలు చూపిస్తున్నాయి. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. నీటి పథకం పనుల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో పైవంతెన నిర్మాణాన్ని చేపట్టారు. లింగంపల్లి వాటర్ వర్క్స్ నుంచి పైప్‌లైన్లు వేసేందుకు రోడ్డ తవ్వకాలు మొదలుపెట్టారు. దీని కోసం మద్రాసురోడ్డు ప్రధాన రహదారిని దాదాపు మూడేళ్ల కిందట తవ్వేశారు. పనులు పూర్తి చేసేందుకు రెండు నెలల కిందట మద్రాసు రోడ్డు నుంచి శంకరాపురం రోడ్డు నంబరు 7, 8, 9 ఉపమార్గాలను తవ్వారు. దీంతో ఈ వీధుల్లోని ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు తవ్వకాలు జరిపిన ప్రాంతం బురదమయమవుతోంది. ఈ ప్రాంతాల్లో వివిధ వైద్యశాలలున్నాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు ఈ వీధుల్లోకి ప్రవేశించడం కష్టంగా మారింది. ఈ విషయంపై ఏఈఈ స్వరూపను వివరణ కోరగా.. పైప్‌లైన్ పనులు పూర్తి చేశామన్నారు. ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు.

నకిలీ దివ్యాంగులు

– న్యూస్‌టుడే, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని కొంతమంది దివ్యాంగుల జాబితాలో సామాజిక భద్రతా పింఛన్లు పొందారు. వాస్తవంగా అర్హత లేకపోయినా కాసుల కక్కుర్తితో రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొన్నారు. మరికొందరు దళారులను ఆశ్రయించి మానసికంగా, శారీరకంగా బాగున్నా వైకల్యం ఉన్నట్లు దొంగ పత్రాలు సృష్టించారు. అధికారులు కూడా పరిశీలన చేయకుండా మంజూరు చేశారు. దర్జాగా లబ్ధిపొందారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఇస్తున్న సొమ్మును అమాంతం రెట్టింపు చేశారు. అనర్హులు ఆయాచితంగా, అక్రమంగా మింగేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వాస్తవమేంటి విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో వాస్తవ పత్రాలను పరిశీలన చేయడంతో అక్రమ బాగోతం వెలుగుచూసింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లను నిలిపివేయాలని కీలక నిర్ణయం తీసుకొన్నారు. ఆ జాబితాను పురపాలక, నగరపాలక, ఎంపీడీవో కార్యాలయాలకు పంపిస్తూ ఉత్తర్వులిచ్చారు.

● జిల్లాలో సెప్టెంబరు నెలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకంలో 2,61,663 మందికి సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేశారు. వీరికి రూ.111.42 కోట్లు కేటాయించారు. వచ్చే నెల 1న గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇంటికెళ్లి పంపిణీ చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారు. దివ్యాంగులు 39 వేల మంది ఉన్నారు. గత వైకాపా పాలనలో వైకల్యంతో బాధపడుతున్న వారికి నెలకు ఒక్కొక్కరికి రూ.మూడు వేలు పింఛను ఇవ్వాలని ముందుకొచ్చారు. ఇక్కడే అక్రమాలకు తెరలేపారు. నిబంధనలను తుంగలో కొంతమంది అడ్డగోలుగా అక్రమ మార్గంలో పింఛను పొందాలని ఎత్తుగడ వేశారు. సదరం శిబిరాలకు వెళ్లకుండా, అధికారికంగా వైకల్యం ఉన్నట్లు అధికారికంగా నియమించిన వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందకుండా అడ్డదారులు తొక్కారు. వైకాపా నాయకుల కనుసన్నల్లో కొందరు దళారుల అవతారమెత్తారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్నారని ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించారు. క్షేత్రస్థాయిలో వాలంటీర్ల ద్వారా ప్రతిపాదనలు అందటంతో అంతా నిజమేనని అధికారులు కూడా అనుమతివ్వాలని సిఫార్సు చేశారు. మొన్నటి వరకు అడిగేవారు లేకపోవడంతో ప్రజాధనాన్ని అప్పనంగా తిన్నారు. అంతా బాగున్నా దివ్యాంగుల కోటాలో పింఛను ఎలా పొందారని స్థానికుల్లో చర్చనీయాంశమైంది.



ఎన్డీయే కూటమి రాకతో వెలుగులోకి

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజా మద్దతుతో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఆర్థికంగా భరోసా ఇవ్వాలని ముందుకొచ్చారు. వైకాపా పాలనలో ఒక్కొక్కరికి ఇస్తున్న రూ.3 వేలు నుంచి రూ.ఆరు వేలుకు పెంచారు. మంచానికి పరిమితమైన వారికి రూ.ఆయిదు వేలు ఇస్తుండగా రూ.15 వేలు ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకొన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి లబ్ధి పొందుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో అలాంటి వారిని గుర్తించారు. వీరి ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయాలని నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా చూస్తే 2,242 మందికి తాఖీదులు ఇచ్చారు. వీరిలో 122 మంది మాత్రమే హాజరయ్యారు. పత్రాలు తీసుకొచ్చిన లబ్ధిదారుల్లోనూ బోగస్ బాగోతం ఉన్నట్లు తేల్చారు. మిగతా వారు అసలు హాజరవ్వ లేదు. జిల్లాలో మొత్తం 2,204 మందికి పింఛన్లు నిలిపివేయాలని జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాను నగర పాలక, పురపాలక, ఎంపీడీవో కార్యాలయాలకు రెండు రోజుల కిందట పంపించారు. సచివాలయ సిబ్బందికి ఈ సమాచారాన్ని అందజేసి పింఛన్లు నిలిపివేయాలని ఆదేశించారు. కాశినాయన మండలంలో అత్యధికంగా 259 మంది, సిద్ధవటంలో అతి తక్కువగా ముగ్గురికి పింఛన్లు రద్దు చేశారు.

దుర్వినియోగానికి అడ్డుకట్ట - రూ.1.30 కోట్లు ఆదా

అనర్హుల పింఛన్లు తొలగించడంతో నెలకు రూ.1.30 కోట్లు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేశారు. పక్కాగా పరిశీలిస్తే మరికొందరు అనర్హులు ఉంటారని లబ్ధిదారుల నోట వినిపిస్తోంది. దొంగ పత్రాలతో పింఛను మంజూరు చేయాలని సిఫార్సు చేసిన అధికార యంత్రాంగంపై చర్యలు తీసుకుంటారో, వదిలేస్తారో చూడాలి.



(c) eenadu

లారీ ఢీకొని యువతి మృతి

దువ్వూరు, న్యూస్‌టుడే : కడప-కర్నూలు జాతీయ రహదారిపై దువ్వూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం లారీ-బైక్ ఢీకొన్న ఘటనలో మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎ.శ్రావ్య (19) అనే యువతి మృతి చెందగా, నారాయణరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. నారాయణరెడ్డి అనే రైతు తన తమ్ముడి కుమార్తె శ్రావ్యను బైక్‌పై వెనుక కూర్చోపెట్టుకుని సొంత పనిపై దువ్వూరు మండలం వెంకుపల్లె గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ కొంత దూరం వరకు ఇద్దరినీ ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో శ్రావ్య నడుము భాగం తీవ్రంగా గాయపడడంతో ఆ నొప్పి భరించలేక రహదారిపై రోదిస్తుండడంతో స్థానిక మహిళలు ఎంతగానో ఓదార్చారు. వీరికి వైద్యం అందించేందుకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆ మార్గంలో వెళుతున్న ఓ వ్యక్తి కారు ఆపి వీరిని హుటాహుటిన ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న శ్రావ్య అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

బీటెక్ విద్యార్థి దుర్మరణం

అర్జున్‌రెడ్డి (పాత చిత్రం)

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువరామాపురానికి చెందిన బీటెక్ విద్యార్థి కందుల అర్జున్‌రెడ్డి (19) ఆదివారం చెన్నైలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు.. ఎగువరామాపురానికి చెందిన కందుల బాలఅంకిరెడ్డి, బాలవీరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కందుల అరవిందరెడ్డి, అర్జున్‌రెడ్డి సంతానం. చెన్నైలోని సత్యభామ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి కుమారుడు బీటెక్ ఫైనలియర్, రెండో కుమారుడు ఫస్టియర్ చదువుతున్నారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు కిందపడడంతో అర్జునరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. అరవింద రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు చెన్నైకి తరలివెళ్లారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఎగువరామాపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదం జరిగిన తీరు అక్కడ పరిశీలిస్తేకానీ తెలియదని వారి బంధువులు చెప్పారు.

పురాతన పంచలోహ విగ్రహాల చోరీ

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్.ఐ. హృషికేశవరెడ్డి

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బెడుదూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రాచీనకాలం నాటి విగ్రహాలు చోరీ అయ్యాయి. తాళ్ల ప్రొద్దుటూరు ఎస్సై హృషికేశవరెడ్డి వివరాల మేరకు.. మండలంలో ప్రసిద్ధి చెందిన బెడుదూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను శనివారం రాత్రి దుండగులు ఆలయం తాళం పగులగొట్టి ఎత్తుకువెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన పూజారి సురేష్‌బాబు గుడి తాళాలు పగులగొట్టి చోరీ అయిన విషయాన్ని గుర్తించి ఆలయ నిర్వాహకులు, గ్రామస్థుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలాన్ని సీఐ మహమ్మద్ రఫీ, ఎస్సై హృషికేశవరెడ్డి పరిశీలించారు. కడప నుంచి క్లూస్, డాగ్‌స్క్వాడ్ టీమ్ సభ్యులు ఘటన స్థలాన్ని పరిశీలించి పలు ఆధారాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు. స్థానికులు మాట్లాడుతూ చోరీకి గురైన పురాతన విగ్రహాలు అత్యధిక విలువ జేస్తాయన్నారు. విలువైన పురాతన సంపదను చోరీ చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కాశినాయన బీపీఎంపై కేసు నమోదు

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం గ్రామ తపాలాలో వివిధ పొదుపు బీమా ఖాతాలో నగదు స్వాహా చేసి పరారీలో ఉన్న బీపీఎం తిరుమల నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అనంతరం ఖాతాదారులను పిలిపించి ఎంత డబ్బులు స్వాహా జరిగిందనే విషయంపై వివరాలు సేకరించారు. పరారీలో ఉన్న బీపీఎం తిరుమల నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇతనితోపాటు మరో నలుగురి పాత్ర ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది.

టిప్పర్ బోల్తా

ముద్దనూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నల్లబల్లె గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున టిప్పర్ బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కంకర లోడుతో వస్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

లెక్కకు మించి గనులు... నిబంధనలు పట్టని ఘనులు

క్వారీల్లో అడ్డగోలు తవ్వకాలు

అస్మదీయులకు అంటకాగిన వైకాపా

భద్రతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు

మదనవల్లె మండలం 150వ మైలు సమీపంలో నిర్వహిస్తున్న క్వారీ

మదనవల్లె పట్టణం, న్యూస్‌టుడే : పరిశ్రమలు, గనుల్లో నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, చట్టవ్యతిరేకంగా పేలుడు పదార్థాలను వినియోగించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పనిచేసే కార్మికులకు ప్రాణాంతకంగా మారినా పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదు. ముందస్తుగా తనిఖీలు నిర్వహించే నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా సంబంధితశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాద ఘటనలు పునరావృతమవుతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణితో కార్మికులు విగతజీవులవుతున్నారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఉల్లంఘనులకు కొదువ లేకుండా పోతోంది.

● మదనపల్లె పరిసరాల్లో లెక్కకు మించి గనులు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లాను గనుల ఖిల్లాగా పేర్కొంటారు. అధికారుల చేతులు తడిపి అడ్డదారుల్లో అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ ఎగుమతి చేస్తున్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 100కు పైబడి క్వారీలు ఉన్నట్లు అంచనా. ఇందులో యజమానులు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం కూడా జరిగింది. ప్రధానంగా క్వారీల్లో పేలుడు పదార్థాలను వినియోగించే సమయంలో ముందుజాగ్రత్తలు చేపట్టాలి. పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను అప్రమత్తం చేయాలి. పేలుడుకు దూరంగా ప్రజలను పంపేయాలి. కొన్ని క్వారీల్లో పేలుడుకు అనుమతి లేకున్నా చట్ట విరుద్ధంగా పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. క్వారీల్లో పనిచేసే కార్మికులకు మైనింగ్‌శాఖ ఆదేశాల మేరకు వారి భద్రతకు సంబంధించి హెల్మెట్, బూట్లు, అద్దాలు వంటి వాటిని సమకూర్చాలి. ఇలాంటి వసతులు ఎక్కడా కల్పించడంలేదు.

కొన్ని సంఘటనలు పరిశీలిస్తే....

● పుంగనూరు రోడ్డు వలసపల్లె పంచాయతీ పరిధిలో 150వ మైలు సమీపంలోని క్వారీలో గతంలో పేలుడు జరిగింది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ సమయంలో అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని అధికారుల దర్యాప్తులో తేలింది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు.

● మదనపల్లె మండలంలో బండకిందపల్లె పద్ధ భారీ స్థాయిలో మైనింగ్ జరుగుతోంది. ఇందులో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదానికి గురై మరణించాడు. అంతేకాకుండా పేలుడు శబ్దానికి పరిసర గ్రామాల్లోని ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. ప్రస్తుతం అక్కడ కంకర, పునాదిరాళ్లు వంటి వాటిని తయారు చేయడానికి క్వారీని వినియోగించుకుంటున్నారు.

● అమ్మచెరువుమిట్ట క్వారీలో పేలుడు జరిగి ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. అతని చేతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక్కడ బండను తీయడానికి పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. నివాస ప్రాంతాల్లో పేలుడు పదార్థాలను వినియోగించరాదని నిబంధన ఉన్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పేలుడు పదార్థాలను వినియోగించడం వల్ల అమ్మచెరువుమిట్టలో నిర్మించుకున్న ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. స్థానికులంతా ఏకమై అధికారులకు ఫిర్యాదు చేశారు.

● మదనపల్లె పట్టణం పారిశ్రామికవాడలో కంటైనర్‌కు మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా పేలుడు జరిగింది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మరో వ్యక్తి గాయపడ్డారు. ఇదే ప్రాంతంలో ఒక కార్పొరేట్ వాణిజ్య సంస్థ బిల్డింగ్ నిర్మించడానికి అక్కడున్న బండలను తొలగించేందుకు పేలుడు పదార్థాలను వినియోగించారు. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఆభ్యంతరం తెలిపారు. పేలుడు పదార్థాలు వినియోగించడం వల్ల ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోపడంలో జాప్యం జరుగుతోంది.

● మైలవరం మండలంలో జరిగే గనుల తవ్వకాల్లో జరుపుతున్న పేలుళ్ల వల్ల స్థానికంగా ఇళ్ల గోడలు నెరైలు చీలి పగుళ్లిస్తున్నాయని పలు గ్రామాల్లో ఆందోళనలు జరిగాయి. నేటికీ పరిస్థితి అలాగే ఉంది. ఇక్కడ పలు గనుల్లో అనధికారికంగా తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

● మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి సమీపంలో కంకర కోసం గుట్టల్లో పేలుళ్లు జరుపుతుండడంతో సుగాలితాండాలో భీకరమైన శబ్దాలకు భూమి కంపించడంతో పాటు గోడలు నెరైలు చీలాయని స్థానికులు ఇటీవల ఆందోళన చేపట్టారు. ముదిరెడ్డిపల్లెకు 800 మీటర్ల దూరంలో ఉన్న గుట్టను పేల్చి హైవే పనులకు అవసరమైన కంకరను సేకరిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న కందుల సంస్థల ఎండీ చంద్రఓబుల్‌రెడ్డి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎండీ కె. చంద్రఓబుల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి ఆర్.నాగరాజు పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం మేనేజ్‌మెంట్, బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అవగాహన, పరస్పర ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధనకు మొదటి ఏడాది నుంచి కృషి చేయాలని, అందుకు తగిన వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైస్ ప్రిన్సిపల్ టీఎన్.ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక విద్యతో పాటు పోటీపరీక్షలకు కావాల్సిన వర్చువల్ ఇంటర్వ్యూలు, మాక్‌టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దసరాకు ఆలయాల ముస్తాబు

ఆలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: దసరా సంబరాలు ప్రారంభకానున్నాయి. జమ్మలమడుగులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి విద్యుత్తు దీపాలను అలంకరిస్తున్నారు. అక్టోబరు 3వ తేదీ పార్వతీ దేవి అలంకారంతో ప్రారంభమై 13వ తేదీ వసంతోత్సవంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు పలు ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

బద్వేలు గ్రామీణ: అమ్మవారిశాలలో ఆదివారం అవోపా ఆధ్వర్యంలో దాతల సహకారంతో దసరా ఉత్సవాల సందర్భంగా నిరుపేద వెళ్యలకు దుస్తులు పంపిణీ చేశారు. అవోపా అధ్యక్షుడు నూకల రెడ్డెయ్య మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో నిరుపేద వైశ్యులకు దాతల సహకారంతో ప్రతి నెల పింఛన్ పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు,మాధవి, శ్రీవాణి పాల్గొన్నారు.

పోలవరానికే కాదు సీమకూ నిధులివ్వండి

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అమరావతి, పోలవరం అభివృద్ధి మాత్రమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కేంద్రంతో నిధులు సాధించాలని సీఎం చంద్రబాబునాయుడును రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాల్గో రాష్ట్ర మహాసభలు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పురపాలక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 శాతం భూములకు నీటి ప్రాజెక్టులు ఉంటే రాయలసీమలో కేవలం తొమ్మిది శాతం భూములకు మాత్రమే కట్టారన్నారు. చంద్రబాబుకు అమరావతిపై ఉన్న పట్టుదల సీమ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఉండాలన్నారు. సీమ అభివృద్ధికి రాజకీయాలను పక్కన పెట్టి ఇక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు సీమ ఉద్యమాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. విభజన హామీలు అమలు తీరుపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ నిజమైన మానవతా ఉద్యమం ఏదైనా ఉందంటే అది సీమ నీళ్ల ఉద్యమం అన్నారు. కేంద్రం చట్టబద్ధంగా చేసిన విభజన చట్టంలో సీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు ఫ్యాక్టరీపై మాట్లాడకుండా సీమ పాలకవర్గాలు వారి ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం తెరమీదకి తెచ్చి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. సభలో వేదిక రాష్ట్ర కో కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, అనంతపురం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కర్నూలు కన్వీనర్ రత్నం ఏసోబు, వైఎస్సార్ కన్వీనర్ మహమూద్‌లతో పాటు విరసం నాయకులు పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి, రమణ, శ్రీనివాసులురెడ్డి, హరిత పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే కూటమికి పట్టం: మంత్రి

సొంతూరు ప్రొద్దుటూరులో ఊరేగింపుగా వెళ్తున్న మంత్రి సత్యకుమార్

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: సామాన్య లారీ డ్రైవర్ కుమారుడినైన నేను మంత్రి అవుతానని ఎప్పుడూ అనుకోలేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంత్రి హోదాలో ఆదివారం సత్యకుమార్ తొలిసారిగా తన సొంతూరు ప్రొద్దుటూరుకొచ్చారు. ఈ సందర్భంగా భాజపా నేతలు, ఆయన సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. వాసవీ సర్కిల్ నుంచి శివాలయం కూడలి వరకూ ర్యాలీ జరిగింది. అనంతరం తితిదే కల్యాణ మండపంలో జరిగిన భాజపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారు కాబట్టే వైకాపాను ఇంటికి సాగనంపారని విమర్శించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బద్వేలు నేత రోశన్న, రాష్ట్ర, జిల్లా నాయకులు సీవీ. జయలక్ష్మి, కోసేటి ప్రదీప్‌రెడ్డి, అరకట వేముల హరినారాయణ, పృథ్వీనారాయణ, పర్లపాడు గౌరీశంకర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సత్యకుమార్‌తో పాటు తెదేపా నేత నంద్యాల కొండారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేత ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, వైద్యుడు వరుణుకుమార్‌రెడ్డి తదితరులతో పౌర స్వాగత రథం సాగింది. రాయల్‌కౌంటీలో పౌరసన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, తెదేపా నేతలు ఆయన్ను కలిశారు. భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు, ఎర్రగుంట్ల : ముద్దనూరు నలుగు రోడ్ల కూడలిలో ఆరోగ్య వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వీరిలో భాజపా ముద్దనూరు నాయకుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఆదివారం పులివెందుల నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న సమయంలో భాజపా నాయకులు సన్మానించారు. ఎర్రగుంట్లలో ఘనస్వాగతం పలికారు. ముందుగా ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలోని విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

పరిసరాల శుభ్రత పౌరుల ప్రథమ కర్తవ్యం

స్వచ్ఛతాహి సేవా ర్యాలీలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు వాణి కిశోర్‌కుమార్‌రెడ్డి, బ్యాంకర్లు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని ప్రథమ కర్తవ్యంగా భావించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ మేనేజరు వాణి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరులోని ఎస్‌బీఐ అన్ని శాఖల నేతృత్వంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. శివాలయం కూడలి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. గాంధీ విగ్రహానికి పూలమాలేసి నివాళి అర్పించారు. అనంతరం అనిబిసెంట్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ స్టాఫ్, యూనియన్ అమరావతి సర్కిల్ కడప రీజినల్ కార్యదర్శి సంజీవ ఆనంద్‌కుమార్, ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ మేనేజరు షేక్.ఫయాజ్ బాషా, ఆయా బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సంఘం సభ్యుల సమావేశం

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక రవీంద్ర పాఠశాలలో కడప, అన్నమయ్య జిల్లాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం కార్యనిర్వాహక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకుడు పి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ట్రిబుల్ ఐటీ ఎంపికలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల కరస్పాండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా పీరివాహకం.. ఆక్రమణల నిలయం

● నిర్మాణాలు చేపడుతున్నా పట్టని అధికారులు

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ప్రొద్దుటూరు పట్టణ శివారున ఉన్న పెన్నా నదిలో సుమారు పది ఎకరాలకు పైగా ఉన్న స్థలంలో ఇటుకల బట్టీని ఏర్పాటు చేశారు. ఈ బట్టీకి సమీపంలో ముళ్లకంపను తొలగించి మరో నిర్మాణానికి మొదలుపెట్టారు. బహిరంగంగా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నా అధికారులు మాత్రం తమకేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లుగా ఉంటుండడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. భూమిని ఒకరు ఆధీనంలోకి తెచ్చుకుని అక్కడి నుంచి చేతులు మారుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈశ్వర్‌రెడ్డినగర్ బైపాస్‌రోడ్డులో అమ్మానాన్న వృద్ధాశ్రమం వెనుక వైపు ఇటుకల బట్టిని ఏర్పాటు చేశారు. పది ఎకరాల స్థలాన్ని రూ.లక్షలకు లీజుకు ఆక్రమణదారుడు ఇతరులకు ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటుకల బట్టిని ఏర్పాటు చేసి ఆక్రమణ చేసిన వ్యక్తి పెన్నానది భాగంలో పాడుబడిన, పనికి రాని మట్టిని పదుల సంఖ్యలో ఎద్దుల బండి ద్వారా వేయించి భూమిని చదును చేయించి తనకు అనుకూలంగా మలచుకున్నాడు. మరో ఆక్రమణదారుడు పొక్లెయిన్ ద్వారా ముళ్లకంపలను తొలగించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తన ప్రాంతంలోకి ఎవరూ రాకుండా ఇనుప కడ్డీని అడ్డంగా ఏర్పాటు చేశారు. నదికి పక్కనే ఉన్న ఏటిపోరంబోకు స్థలంలో కూడా విస్తారంగా నిర్మాణాలు సాగుతున్నాయి. కొద్ది రోజుల కిందట విద్యుత్తు శాఖాధికారులు స్తంభాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో నదీ పోరంబోకు స్థలం ఓ గ్రామంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయనడంలో సందేహం లేదనిపిస్తోంది. ఈ విషయమై తహసీల్దారు గంగయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నదిలో ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీట న్నింటినీ తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

బట్టీకి సమీపంలోనే ముళ్లకంపలను తొలగిస్తున్న పొక్లెయిన్

పెన్నానదిలో ఇటుకల బట్టీ సమీపాన నిర్మాణాలకు ఏర్పాటు చేసిన పునాదిరాళ్లు

సేంద్రియ పంట... ఆరోగ్యం ఇంటింట

● రక్తహీనత నివారణకు మహిళల కృషి ● 'పోషణవాటిక'కు కేంద్ర బృందం గుర్తింపు

-న్యూస్‌టుడే, పోరుమామిళ్ల, చాపాడు

రక్తహీనతలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 187 కేంద్రాల్లో 'సాక్ష్యం' అంగన్‌వాడీ కేంద్రంలోని 'పోషణవాటిక'లో భాగంగా ఆకుకూరలు, కూరగాయల సాగును ఏర్పాటు చేసింది. సేంద్రియ ఎరువుల వినియోగించి కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. విశాలమైన స్థలం ఉన్న కేంద్రాల్లో తోటలను పెంచేందుకు నీటి వసతితోపాటు విత్తనాలు సరఫరా చేశారు. జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 2,212 అంగన్‌వాడీ కేంద్రాలు, 177 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 13,202 మంది గర్భిణులు, 11,220 మంది బాలింతలు ఉన్నారు. వీరికి ఆయా కేంద్రాల పరిధిలో పౌష్టికాహారం అందిస్తున్నారు. ఉన్న వసతులతో కేంద్రాల్లో ఆకుకూరలు, కూరగాయల సాగును చేసి అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవలే ఈ కేంద్రాలను జాతీయ కేంద్ర బృందం ప్రతినిధులు సందర్శించి అభినందించారు.

సిద్దవరం కేంద్రంలో ఆకుకూరలను పంపిణీ చేస్తున్న జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి

అందుబాటులో తాజా కూరగాయలు

నరసాపురంలో అయిదుగురేసి గర్భిణులు, బాలింతలు ఉన్నారు. 13 మంది చిన్నారులు వస్తున్నారు. వీరికి అవసర మైన కూరగాయలు, ఆకుకూరలు పోషణ వాటికలో పండిస్తున్నాం. ఇక్కడ పండినవి తినడం వలన రక్తహీనత లేకుండా ఉంటోంది. మిగిలినవి గర్భిణులు, స్థానికులకు పంపిణీ చేస్తున్నాం. బయట కొనుగోలు చేయకుండా ఇక్కడ పండించినవే వినియోగిస్తున్నారు. కూరగాయలు తాజావి అందుబాటులో ఉంటాయి. **- రమాదేవి, నరసాపురం-I**

ఇక్కడ పండినవే వినియోగం

గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇస్తున్నాం. అధికంగా పోషకవాటికలో పండించినవే వినియోగిస్తున్నాం. ఈ పరిధిలో ఇద్దరు గర్భిణులు, ముగ్గురు బాలింతలు, చిన్నపిల్లలు 16 మంది ఉన్నారు. పోషణ వాటికలో పండించే ఆకుకూరలు, కూరగాయల కేంద్రానికి అవసర మైన వాటివే వినియోగిస్తున్నాం. ఎటువంటి రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. **- శైలజ, పోరుమామిళ్ల**

క్రిమి సంహారక మందులు లేకుండా సాగు

పోషణ వాటికలో భాగంగా అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలను సాగుచేశాం. కేంద్రంలో పండించేందుకు ఐసీడీఎస్ సీడీపీవో విత్తనాలను సరఫరా చేశారు. ఈ విత్తనాలు సాగు చేసి పండించాం. క్రిమి సంహారక మందులు లేకుండా సేంద్రియ ఎరువులతో సాగు చేయడం, వీటిని తినడం వల్ల ఎటువంటి అనర్థాలు లేవు. గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులకు వీటిని పంపిణీ చేస్తున్నాం. **- లీలావతి, సిద్దవరం**

ఈ కేంద్రాలు ఆదర్శనీయం

ప్రాజెక్టు పరిధిలో 27 కేంద్రాల్లో ఈ విధానంలో ఆకుకూరలు, కూరగాయలను సాగు చేశారు. సాగు చేసిన కేంద్రాల పరిధిలో ఆకుకూరలు, కూరగాయలను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. 'సా

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

తూము గేటుకు తుప్పు... ఆయకట్టుకు ముప్పు

గోపవరం చెరువు తూముకు ఉన్నటువంటి గేటు పూర్తిగా తుప్పుపట్టి చెరువుకు సీళ్లు వస్తే నిలువడానికి కూడా అవకాశం లేకపోవడంతో చెరువు కింద భూమి ఉన్నటువంటి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద పెద్దగోపవరం, చిన్నగోపవరం, సంగసముద్రం, భూమిరెడ్డిపల్లెలకు చెందిన రైతులకు చెందిన దాదాపు 500 ఎకరాల భూమి ఆయకట్టులో ఉంది. అధికారులు స్పందించి చెరువు గేటు బాగు చేయాలని అక్కడి రైతులు కోరుతున్నారు. ఇప్పుడు వర్షాకాలం కావడంతో చెరువులోకి నీరు చేరితే నీరు వృథా అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, గోపవరం**

చెత్తశుద్ధి ఏదీ?

జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో కొద్ది రోజులుగా చెత్త తీసుకెళ్లే వాహనం లేక వ్యర్థాలు చెల్లాచెదురుగా విస్తరిస్తున్నాయి. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఒకచోట చేరుస్తారు. అలా చేర్చిన చెత్తను మరొక వాహనాం ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. చెత్తను తరలించే వాహనం పనిచేయక పోవడంతో పలు కూడళ్లు అపరిశుభ్రతతో మారిపోతున్నాయి. కమిషనర్ వెంకటరామిరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా చెత్తను తరలించే వాహనంలో సమస్య తలెత్తితే మరమ్మతులు చేయించామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో కూడళ్లలోని వ్యర్థాలను ఆ వాహనం ద్వారా డంపింగ్‌యార్డుకు తరలిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, జమ్మలమడుగు**

సంక్షేమ పథకాలతో కార్మికులకు భద్రత

కార్మలు అందజేస్తున్న చామల విష్ణువర్ధన్‌రెడ్డి

కొండాపురం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్డీఏ కూటమి నాయకులు చామల విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి భవన నిర్మాణ కార్మికులకు మంజూరు అయిన లేబర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక జిల్లా అధ్యక్షులు అంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ నాయకులు సుబ్బారావు, బహుదూర్‌షావల్లి, ప్రసాద్, మోహన్, రమణ, మద్దిలేటి, వెంకటేష్, శేషారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డీలర్ల నిరసన

సంచి తరుగు బియ్యం ఇవ్వాలని డిమాండు

పౌర సరఫరాల గిడ్డంగి వద్ద ఆందోళన చేస్తున్న డీలర్లు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పౌర సరఫరాల గిడ్డంగి వద్ద ఆదివారం చౌక దుకాణాల డీలర్లు ఆందోళన చేశారు. సంచి తరుగు బియ్యం ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రశ్నిస్తున్న డీలర్లకు నిల్వలు లేవని నిత్యావసర సరకులు సరఫరా చేయక పోవడంతో ఆందోళన చెందిన కొందరు డీలర్లు గిడ్డంగి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ అంశం సామాజిక మాధ్యమంలోనూ వైరల్ అయింది. స్థానిక పౌర సరఫరాల గిడ్డంగి నుంచి మైదుకూరు, దువ్వూరు మండలాల్లోని చౌక దుకాణాలకు నిత్యావసర సరకుల పంపిణీ జరుగుతోంది. బియ్యం సరఫరా చేసే సంచి బరువు దాదాపు 580 గ్రాములు ఉంటుందని అంచనా. చౌక దుకాణానికి ఎన్ని బస్తాలు సరఫరా చేస్తే అన్ని 580 గ్రాములు బియ్యం కలిపి ఇవ్వాల్సి ఉండగా గిడ్డంగి బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప తహసీల్దారు ఇవ్వక పోవడంతో వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయలేక పోతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. సంచికి ఇవ్వాల్సిన తరుగు బియ్యం గురించి ప్రశ్నిస్తే అధికారులు ఇబ్బందులకు గురి చేస్తారని భావించి ప్రశ్నించలేక పోతున్నారని వివరించారు. గిడ్డంగి ద్వారా రావాల్సిన తరుగు బియ్యం విషయంలో ఉప తహసీల్దారు తీరుపై ఇప్పటికే ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఉప తహసీల్దారుపై చర్య తీసుకుని చౌక దుకాణాలకు సక్రమంగా నిత్యావసర సరకులు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. ఈ విషయమై గిడ్డంగి ఉప తహసీల్దారు సుశీలమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సంచి తరుగు బియ్యం తూకం వేసి ఇస్తున్నామని అయినా డీలర్లు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తహసీల్దారు రాజసింహ నరేంద్రను ప్రశ్నించగా సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు, విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారానికి పాలకులు ప్రయత్నం చేయడం లేదని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లు రఘునాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో ఎస్‌టీయూ ప్రొద్దుటూరు రీజియన్ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలులో జాప్యమెందుకని ప్రశ్నించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ పరిరక్షణకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాటుపడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, నాయకులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘం రాష్ట్రాధ్యక్షుడిగా వుట్టి నాగశయనం

దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వుట్టి నాగశయనాన్ని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా రాయలసీమ నుంచి వుట్టి నాగశయనాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు దేవాంగ కర్ణనాగరాజు అధ్యక్ష స్థానంలో వుట్టి నాగశయనాన్ని ఎన్నుకున్నారు. ఈ పదవి వచ్చే ఏడాది అక్టోబరు వరకు కొనసాగనున్నట్లు వుట్టి నాగశయనం తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య, ఐక్య చైతన్య కార్యక్రమాలను జరగడానికి ఐక్యకార్యాచరణ ఉద్యమాల ద్వారా కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు.

మెస్ ఛార్జీలు విడుదలకు వినతి

మైదుకూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం మైదుకూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం-1 వద్ద పీఆర్ఎస్ఐఎఫ్ నాయకులు విద్యార్థులతో సమావేశమయ్యారు. మెస్, కాస్మటిక్ ఛార్జీలను పెండింగ్‌లో పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీఆర్ఎస్ఐఎఫ్ జిల్లా కన్వీనరు నాగేంద్రబాబు అన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

చాపాడు, న్యూస్‌టుడే: ఎస్‌టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) రాష్ట్ర సాంస్కృతిక కమిటీ కన్వీనరుగా ఎన్నికైన శీనుకు సన్మానం జరిగింది. చాపాడులోని గూడూరు అప్పయ్యగారి జడ్పీ ఉన్నత పాఠశాలలో శీను ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఎన్జీవోలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఇలియాజ్‌బాషా, కార్యదర్శి సంఘమేశ్వర్‌రెడ్డి, చాపాడు నాయకులు సుబ్బరాయుడు, చంద్ర పాల్గొని ఆయన్ను సత్కరించారు.

(c) eenadu

నైపుణ్య శిక్షణ... భవితకు నిచ్చెన

న్యూస్‌టుడే, వైవీయూ (కడప)

ధ్రువపత్రాలతో విద్యార్థినులు

యువతకు అన్ని విభాగాల్లో నైపుణ్యం పెంపొందించి, వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ పని చేస్తోంది. అందులో భాగంగా కడపలోని పలు కళాశాలల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తోంది. డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థినులకు నెల రోజుల పాటు నూతన సాంకేతికత, స్పోకెన్ ఇంగ్లిష్, లాంగ్వేజ్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, వ్యక్తిగత విలువల తదితర అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటికే రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ శిక్షణ తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, ఉద్యోగం సాధించడమే కాకుండా, జీవితంలో ఉన్నతస్థాయిలో రాణించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని విద్యార్థినులు పేర్కొంటున్నారు.

ఎలాంటి సవాలుకైనా సిద్ధం : స్రవంతి

కోటిరెడ్డి కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ చివరి ఏడాది చదువుతున్నా. మూడేళ్లలో చదువు పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి స్కోరింగ్ కూడా ఉంది. శిక్షణలో నేర్చుకున్న కమ్యూనికేషన్, లైఫ్, ఎనలిటికల్ స్కిల్స్ నా జీవితంలో పెద్ద మార్పును తెచ్చాయి. ప్రస్తుతం ఎలాంటి సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా. ఉద్యోగం సాధించేందుకు శిక్షణ దోహదపడుతుంది.

అన్ని అంశాలపై పట్టు: శిరీషాబాయి, శిక్షకులు

ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వారు అన్ని అంశాలపై పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యార్థులు ఏ విషయంలో వెనుకబడుతున్నారో తెలుసుకుని అందులో ప్రావీణ్యం సాధించేలా శిక్షణ ఉంటుంది. ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఏర్పడింది: గంగా కృష్ణదేవి

నేను ఇంతకు ముందు స్టేజ్ ఫియర్, కమ్యూనికేషన్ చేయడంలో ఇబ్బంది పడేదాన్ని. ఇప్పుడు ఈ శిక్షణతో వాటిని అధిగమించా. ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఏర్పడింది. శిక్షణలో అనేక విషయాలు నేర్చుకున్నాం. జీవితంలో రాణించడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

ఎంతో ఉపయోగం: ముబాషీరా

డిగ్రీ పూర్తయిన తర్వాత స్పోకెన్ ఇంగ్లిష్, ఇంకా అనేక కోర్సులు చేయాలనుకున్నా. ఇప్పుడు ఇచ్చిన నైపుణ్య శిక్షణతో నేరుగా ఉద్యోగ కోసం పోటీపడే అవకాశం ఏర్పడింది. లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు జీవితానికి ఉపయోగపడే నైతిక విలువలను కూడా నేర్పారు.

ఆదివారం... ఆటవిడుపు

పాలకొండ జలపాతం వద్ద పిల్లలతో కలెక్టర్ శివశంకర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు విధుల్లో బిజీబిజీగా గడిపే ఉన్నతాధికారులకు ఆదివారమే కాసింత విరామం లభిస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తన కుటుంబ సభ్యులతో ఆదివారం పాలకొండల్లో విహరించారు. జలపాత అందాలను ఆస్వాదించారు. పిల్లలతో కలిసి తడిసి ముద్దయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పచ్చటి పాలకొండలు, జలపాత సవ్వడులు, పక్షుల కిలకిల రావాలతో ఆనందంగా గడిపామన్నారు. ఇది కొత్త అనుభూతినిచ్చిందని చెప్పారు.

ఉర్దూ విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టండి

మాట్లాడుతున్న రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఇక్బాల్, పక్కన నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. స్థానిక సాలెనాగయ్య నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆదివారం రూట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కిందట కళకళలాడిన ఉర్దూ మీడియం పాఠశాలల్లో ప్రస్తుతం ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను పాత పాఠశాలల్లోనే కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయ సర్దుబాటులో ఉర్దూ పాఠశాలలకు బదిలీ చేసిన ఇతర మాధ్యమ ఉపాధ్యాయులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రూట రాష్ట్ర డైరీ విభాగం ఛైర్మన్ హాజి అబ్దుల్ హకీమ్ సాహెబ్, నాయకులు మస్తాన్‌వలీ, అష్టల్ బాషా, ముహమ్మద్‌ఇర్షాద్, ముమమ్మద్‌అయ్యూబ్, బెపారి ఫకృద్దీన్, హబీబుల్లా, ముహమ్మద్‌దావూద్, అర్షద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీలో జిల్లాకు ప్రథమ స్థానం

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: పంటలు సాగు చేసిన రైతుల ఈకేవైసీ దాదాపు పూర్తయిందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 3,08,819 ఎకరాలు కాగా అంతా ఈ-పంటలో నమోదు చేశామన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల సంఖ్య జిల్లాలో 1,12,934 మంది కాగా శనివారం సాయంత్రానికి 1,11,845 మందికి ఈకేవైసీ చేసి 99.16 శాతంతో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సోమవారం గడువు ముగిసే సమయానికి అంతా పూర్తి చేస్తామని వెల్లడించారు.

అధ్యాపకుల బదిలీపై విచారణ చేపట్టాలి

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: ఇంటర్ అధ్యాపకుల బదిలీలపై తక్షణమే విచారణ చేపట్టి అక్రమాలు, అవినీతిని వెలికితీయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీశ్, నాగరాజు డిమాండ్ చేశారు. కడపలో ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో బదిలీలను నిషేధించినప్పటికీ రాయలసీమ పరిధిలోని 4వ జోన్‌లో కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల పదోన్నతులు చేపట్టారన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు వీటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నందకిషోర్, కుమార్, రమణారెడ్డి, రవి పాల్గొన్నారు.

పథకాల అమల్లో విఫలం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని వైకాపా జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. ఆయన కడపలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రూ.30 వేల కోట్ల అప్పులు చేశారని, వాటితో ఏ కార్యక్రమాలు చేపట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టి మరల్చడానికి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని వివాదాస్పదం చేశారని ఆరోపించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: కడప రిమ్స్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్, దంత వైద్య కళాశాలలో మినీ ఆడిటోరియం, సెంట్రల్ ల్యాబ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి అధికారులు, వైద్యులతో సమావేశమవుతారు.

ఆధ్యాత్మిక పరిమళాలతో శ్రీదేవి త్రయ శతక మంజరి

పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీ వేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: విద్యాతపస్వి మామిళ్ల లోకనాథం రాసిన శారదాంబ, లక్ష్మి, దుర్గ శతక త్రయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతుందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయాల సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత డైట్ ప్రిన్సిపల్ మామిళ్ల వెంకట లోకనాథం రచించిన శ్రీదేవిత్రయ శతక మంజరి పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం పాత కడప హిందూ ధర్మ సమాజ ప్రార్థన దేవాలయంలో నిర్వహించారు. ఏఎల్ కృష్ణారెడ్డి పుస్తకావిష్కరణ చేయగా, వెల్లాల వెంకటేశ్వరాచారి సమీక్షించారు. డాక్టర్ పసుపులేటి శంకర్, సతీష్‌కుమార్‌రెడ్డి, కాల్వ సోమకళానాథరెడ్డి, గానుగపెంట హనుమంతరావు, రఘునాథరెడ్డి, కోడూరు సుమనశ్రీ, ఒంటిమిట్ట నారాయణరెడ్డి, సాహితీ వేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో వైద్య రంగం నిర్వీర్యం

పార్నపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, పక్కన నాయకులు

పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : జగన్ అయిదేళ్ల రాక్షసపాలనలో రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పులివెందులలోని భాజపా జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మార్క్‌ఫైడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తెదేపా సింహాద్రిపురం మండల పరిశీలకుడు జోగిరెడ్డి, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, భాజపా సీనియర్ నాయకులు శింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, గాలిహరిప్రసాద్, తదితరులు మంత్రిని కలిసి సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో వంద రోజుల పాలన విజయవంతమైందన్నారు. జగన్ ప్రభుత్వం దొడ్డిదారిన వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకొచ్చి మౌలిక వసతుల కల్పనలో విఫలమైందన్నారు. సొంత నియోజకవర్గం పులివెందులలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మించినా హాస్టల్ నిర్మాణం చేపట్టలేదని దీంతో తరగతులు ప్రారంభం కాలేదన్నారు. జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయకూడదన్న నెపంతోనే తిరుమల పర్యటన వాయిదా వేసుకున్నారని పేర్కొన్నారు.

ఆరోగ్య సేవల విస్తరణకు కృషి: లింగాల: పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన పార్నపల్లెలోని తెదేపా నాయకుడు ధనుంజయ స్వగృహానికి చేరుకుని కార్యకర్తలు, నాయకులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వెలిదండ్ల బస్టాండు కూడలిలో భాజపా మండల శాఖ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జండా ఆవిష్కరించారు. లింగాలలో కూటమి నాయకులు తేరా మహేశ్వరరెడ్డి అధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. తెదేపా మండల బాధ్యుడు విశ్వనాథరెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఈ వైద్యుడు మాకొద్దు: లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కల్యాణ్‌దినకర్ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆదివారం లింగాల వచ్చిన మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు స్థానికులు పిర్యాదు చేశారు. ఈ వైద్యుడు తమకొద్దంటూ వంద మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. చిన్నపిల్లలు, గర్భిణులు వచ్చినా వైద్య పరీక్షలు చేయడం లేదని, వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి టోర్నీ విజేత రూపేష్‌రెడ్డి

విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కడప క్రీడలు: రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా కడప నగరానికి చెందిన మాస్టర్ రూపేష్‌రెడ్డి నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగర శివారులోని అలంఖాన్‌పల్లెలోని విస్‌డమ్ పాఠశాలలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారి పేర్కొన్నారు. గిద్దలూరుకు చెందిన ఎన్.ప్రసాద్ ద్వితీయ, మదనపల్లికి చెందిన విక్రమ్‌తేజ మూడో స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు వరుసగా రూ. 6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు అందజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి చెస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా అడ్డగింత

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే : గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనుల పేరుతో మండల వ్యాప్తంగా ఇష్టానుసారం కొండలను కొల్లగొట్టి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని భాజపా మండల బాధ్యుడు గవేశ్వరయాదవ్, హిందూ చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ యరమల నరేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మట్టి అక్రమ రవాణాను నిరసిస్తూ ఆదివారం ఇందుకూరు గ్రామస్థులతో కలిసి టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మేఘా సంస్థ పనులు చేపడుతోందన్నారు. అనుమతులు లేకున్నా ఇష్టానుసారం కొండలను కొల్లగొడుతూ ఆనకట్టకు సమీపంలోనే పేలుళ్లు జరుపుతున్నారన్నారు. దీంతో ప్రాజెక్టు కట్టకు ప్రమాదం జరిగితే దాదాపు పది గ్రామాలు పూర్తిగా నీటిలో మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొండలను కొల్లగొడుతుండటంతో పశువుల మేత కోసం తాము ఎక్కడికి వెళ్లాలని అధికారులను నిలదీశారు. మట్టి తవ్వకాలు ఆపకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీరపునాయునిపల్లెకు వచ్చి తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతిపత్రం అందించారు.

సీమకూ నిధులివ్వండి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అమరావతి, పోలవరం అభివృద్ధి మాత్రమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కేంద్రంతో నిధులు సాధించాలని సీఎం చంద్రబాబునాయుడును రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాల్గో రాష్ట్ర మహాసభలు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పురపాలక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 శాతం భూములకు నీటి ప్రాజెక్టులు ఉంటే రాయలసీమలో కేవలం తొమ్మిది శాతం భూములకు మాత్రమే కట్టారన్నారు. విభజన హామీలు అమలు తీరుపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ నిజమైన మానవతా ఉద్యమం ఏదైనా ఉందంటే అది సీమ నీళ్ల ఉద్యమం అన్నారు. కేంద్రం చట్టబద్ధంగా చేసిన విభజన చట్టంలో సీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు ఫ్యాక్టరీపై మాట్లాడకుండా సీమ పాలకవర్గాలు వారి ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం తెరమీదకి తెచ్చి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. వేదిక రాష్ట్ర కో కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మహమూద్, రాజశేఖర్‌రెడ్డి, రత్నం ఏసోబు, పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి, రమణ, శ్రీనివాసులురెడ్డి, హరిత పాల్గొన్నారు.

అద్దె కోసం ఆశ పడితే... అసలుకే మోసం

పెరుగుతున్న కార్ల బాధితులు ☛ ఇప్పటి వరకు 26 వాహనాల స్వాధీనం

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకున్న కార్లు

కొందరు వ్యక్తులు కార్లను అద్దెకు తీసుకుంటున్నారు. యజమానులకు రెండు నెలలు సక్రమంగా డబ్బులు చెల్లిస్తున్నారు. మూడో నెల నుంచి ఎగ్గొడుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సమాధానం ఉండడం లేదు. గట్టిగా అడిగితే కుదువ పెట్టాం.. ఏం చేస్తారో చేసుకోండి అంటున్నారు... దీంతో యజమానులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కడప నగరంలో ఈ తరహా మోసాలు ఎక్కువయ్యాయి. ఇటీవల కడప తాలూకా ఠాణా పరిధిలో శశిధర్‌రెడ్డి, జిలానీ అనే వ్యక్తులు ఇలాంటి మోసాలకు పాల్పడడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు 34 మంది ఫిర్యాదు చేయగా, 26 కార్లను స్వాధీనం చేసుకున్నారు. కేవలం వీరిద్దరే ఇన్ని వాహనాలను కుదువ పెట్టినట్లు గుర్తించి, వాటిని జప్తు చేశారు. నిందితులు గత ఆరుమాసాల నుంచి ఈ వ్యవహారం నడుపుతున్నట్లు సమాచారం.

ఒక్కొక్కరుగా బయటకొస్తున్న బాధితులు

కార్ల యజమానులు నెల తిరిగేసరికి రూ.30 వేలు అద్దె వస్తుంది కదా అని గుడ్డిగా నమ్మి మోసపోయారు. కడపకు చెందిన వీరేంద్ర కారును అద్దెకు తీసుకుని నిందితులు రెండు నెలల అనంతరం కుదువ పెట్టారు. దీనిపై బాధితుడు తాలూకా ఠాణాలో ఫిర్యాదు చేశారు. తర్వాత మరికొందరు ఇలా మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే సుమారు రూ.కోటి విలువైన వాహనాలను నిందితులు కుదువ పెట్టినట్లు సమాచారం. సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసును విచారిస్తున్నారు. అధికారికంగా ఇప్పటి వరకు 26 కార్లను గుర్తించగా, మరికొన్ని వాహనాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకే వ్యక్తి నుంచి మూడు కార్లను తీసుకుని తాకట్టు పెట్టడం గమనార్హం. వీరి వెనుక ఎవరైనా బడా వ్యక్తుల హస్తముందా అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. జీవనోపాధి కోసమని కార్లను అద్దెకిచ్చి మోసపోయామని, పోలీసులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై పోటీలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని అల్మాస్‌పేటలో జామియాతుస్సాలిహత్ మదరసాలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష పోటీలకు మంచి స్పందన లభించింది. సొసైటీ అధ్యక్షుడు ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. యువత ధార్మికంగా, నైతికంగా ఎదగడానికి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర అధ్యయనం దోహదపడుతుందని చెప్పారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు హిదయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టరు సయ్యద్ అహ్మద్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఠాణాలకు సీఐల నియామకం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని 9 ఎక్సైజ్ స్టేషన్లకు సీఐలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సెబ్‌ను ఎక్సైజ్‌లోని విలీనం చేసిన నేపథ్యంలో వీరికి పోస్టింగులు ఇచ్చారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో మెస్, కాస్మాటిక్ ఛార్జీలు పెంచాలని, తొమ్మిది నెలల నుంచి ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. తల్లికివందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 77 రద్దు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు న్యాయం చేసే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో మార్పులు చేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, వైఎస్ఆర్ జిల్లా కోశాధికారి సాయి, విద్యార్థులు గౌస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎండీ కె.చంద్రఓబుల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి ఆర్.నాగరాజు పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం మేనేజ్‌మెంట్, బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అవగాహన, పరస్పర ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధనకు మొదటి ఏడాది నుంచి కృషి చేయాలని, అందుకు తగిన వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైస్ ప్రిన్సిపల్ టీవీఎన్.ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక విద్యతో పాటు పోటీపరీక్షలకు కావాల్సిన వర్చువల్ ఇంటర్వ్యూలు, మాక్‌టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కందుల సంస్థల ఎండీ చంద్రఓబుల్‌రెడ్డి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : మండల పరిధి గంగనపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సావిత్రిదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా క్రీడా పాఠశాలలో ఈ నెల 28న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల ఎంపికల్లో అండర్ -17 హేమర్ త్రో బాలుర విభాగంలో మన్మోహన్‌రెడ్డి ప్రథమ స్థానంలో, సన్నీ కుమార్ రాజు ద్వితీయ స్థానంలో, బాలికల విభాగంలో రవిత్రేణి ప్రథమ స్థానం, రేహానా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. పోల్ వాల్ట్‌లో సుహానా ఫౌజియా ప్రథమ, మోసిన ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

వ్యాయామం, మితాహారంతో గుండెకు రక్షణ

ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు

కడప విద్య, న్యూస్‌టుడే : క్రమం తప్పని నడక, వ్యాయామం, మితాహారంతోనే గుండె సంరక్షణ సాధ్యమని వైద్యనిపుణులు డాక్టర్ వంశీధర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం కళాశాల జంతుశాస్త్ర విభాగం, సర్‌సీవీ రామన్ సైన్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా వాకర్స్‌కు 'గుండె సంబంధిత వ్యాధులు... తీసుకోవాల్సిన జాగ్రత్తలు' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మురళీమాధవ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, రామన్ సైన్స్ క్లబ్ గౌరవ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, కళాశాల జంతుశాస్త్ర విభాగం ఉపన్యాసకులు డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవిశేఖర్, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ విశ్వనాథం, అపర్ణ, మహేష్, జనవిజ్ఞానవేదిక నాయకులు శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామరాజు, సునీత పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా, నా కక్షిదారుడైన బుద్దాయపల్లె సర్పంచ సామ్యుయేల్, తండ్రి లేట్ సర్పంచ సుబ్బముదాస్, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్, డోర్ నెం. 3/691, రాజారెడ్డి వీధి నివాసి, కడప నగరం అను వారు ఇచ్చిన సూచనల మేరకు ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయుటకు క్రింద ఇవ్వబడిన బహిరంగ ప్రకటన.

నా కక్షిదారుడగు బుద్దాయపల్లె సర్పంచ సామ్యుయేల్ గారికి తన తండ్రి గారికి సంబంధించిన సర్వే నెం. 363/1లోని మొత్తం య. 0.78 సెంట్ల ప్లైటు య. 0.36 సెంట్ల భాగ పరిష్కారంలో తనకు రాజుడిన తన పేరు మీద రెవెన్యూ రికార్డులో పట్టాదారు పాసు బుక్కు, మరియు టైటిల్ డీడ్ పట్టా నెం. 884గా మా కక్షిదారుని పేర ఇ

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

అన్నక్యాంటీన్‌కు నగదు వితరణ

పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : అన్నక్యాంటీన్ నిర్వహణకు పులివెందుల గుడ్‌మార్నింగ్ ప్రతినిధుల బృందం ఆదివారం రూ.66,116 చెక్కును పులివెందులలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అన్నక్యాంటీన్ నిర్వహణకు విరాళాలిచ్చేందుకు దాతలు ముందుకు రావడం హర్షనీయమన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న గుడ్‌మార్నింగ్ ప్రతినిధుల బృందం

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

ఎన్డీయే పాలనలో బీసీలకు పెద్దపీట

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు పెద్దపీట వేశారని తెదేపా పద్మశాలి సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరామ్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తమాధవరం తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం ప్రాతినిధ్యం పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని సీఎం చంద్రబాబు ప్రకటించడం చాలా సంతోషకరమన్నారు. నాయకులు ఆలూరి వెంకటసుబ్బయ్య, నామాల వెంకటసుబ్బయ్య, సాధు శ్రీనివాసులు, ఆలూరు ప్రసాద్, ఎంపీ కృష్ణమూర్తి, గోసంగి అయ్యవారయ్య, జానపాటి సుబ్బరాయుడు, కల్లే పల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475
స్పందనకు కంపనం

✤ కడప శివారులోని ఆజాద్‌నగర్‌కు వెళ్లే దారిలో చెత్తాచెదారం డంపింగ్‌యార్డుగా మారిందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు వ్యర్థాలను తొలగించారు.

✤ కడప సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాల సమీపంలోని చౌటుపల్లెకు వెళ్లే దారిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టారు.

✤ కడప ఆర్టీసీ బస్టాండులో కార్గో వద్ద ఉన్న మూత్రశాలల నుంచి దుర్వాసన వస్తోందని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి అక్కడ ఫినాయిల్, బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, చిన్నచౌకు**

చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు

పులివెందుల(వేంపల్లె),న్యూస్‌టుడే : పులివెందులలో చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ బుక్కేముర్రి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాజారెడ్డికాలనీ, నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ కెమెరాల సాయంతో పటిష్ఠ నిఘా ఉంచామన్నారు. సీఐ గంగనాథ్‌బాబు, ఎస్సై నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ప్రత్యేక గుర్తింపు

అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం చర్యలు

-న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

గతంలో ఎంతో ప్రాముఖ్యం పొందిన పొదుపు సంఘాలు గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వీర్యమయ్యాయి. చాలాచోట్ల వీవోఏలు, సీసీలు నగదును పక్కదారి పట్టించినట్లు పలు ఫిర్యాదులందాయి. రుణాలూ సక్రమంగా అందని పరిస్థితి ఉంది. కొందరు సభ్యులు రెండు మూడు సంఘాల్లో ఉన్నట్లు రాష్ట్ర అధికారులు గుర్తించారు. పలు ప్రాంతాల్లో నకిలీ సంఘాలు ఏర్పాటై రుణాలు తీసుకుని ఎగ్గొట్టాయనే ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. అనర్హులను ఏరివేసి, లోపాలను సరిదిద్ది, అర్హులకు న్యాయం చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో ఒక్కో సంఘానికి, సంఘ సభ్యులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, డిజిటల్ నంబర్ల (ఎన్‌ఆర్ ఎల్‌ఎం కోడ్) ఇవ్వనున్నారు.

200 మించని లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం ప్రకారం

కడపలో స్వయం సహాయక బృంద సభ్యుల సమావేశం

ఏటా కనీసం 5 వేల వరకు కొత్త స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు కావాలి. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి 200కు మించలేదు. వారికి పథకాలు వర్తింపజేయాల్సి వస్తుందనే లబ్ధిదారులను తగ్గించారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 27,600 సంఘాలున్నాయి. వీటిలో సుమారు 3 లక్షల మంది వరకు సభ్యులున్నారు. వీరిలో కొంతమంది రెండేసి సంఘాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రక్షాళన చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ డిజిటల్ ఐడీ

ప్రస్తుతం సాధారణ సభ్యులకు మాన్యువల్ ఐడీ కేటాయించారు. ఈ-కోడ్ రూపంలో రాష్ట్రం, జిల్లా, మండల, గ్రామ సంఘాలకు సూచికలుంటాయి. ఏపీఎం లాగిన్‌లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించేవారు. ఇక నుంచి డిజిటల్ ఐడీలోకి మార్పు చేయనున్నారు. ఈ నంబరు పరిధిలోనే సంఘంలోని సభ్యులంతా ఉంటారు. ఇది వేరే గ్రూపుల్లో ఉండేందుకు ఆస్కారం ఉండదు. జిల్లాలో నకిలీ స్వయం సహాయక సంఘాలను గుర్తించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి నివేదిక వస్తుందని, ఆ తర్వాత చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

GOVERNMENT DENTAL COLLEGE AND HOSPITAL, KADAPA
Extends a very warm welcome to
Smt. R.Madhavi Reddy Garu, Honourable MLA, Kadapa
Sri P.Krishna Chaitanya Reddy Garu, Honourable MLA, Kamalapuram
Sri Satya Kumar Yadav Garu, Hon'ble Minister of Health, Family Welfare & Medical Education, Government of Andhra Pradesh
Sri Lotheti Siva Shankar Garu, IAS, Collector & District Magistrate, YSR District, Kadapa
Dr. M.Jyothsna, Principal, Staff & Students

ఆరేళ్ల బాలికపై అత్యాచారం

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండలంలోని నెరుసుపల్లి పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై శివాజీ అనే వ్యక్తి అత్యాచారం చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు చిన్నారి తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు పంపామన్నారు.

కోతి దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : మండల పరిధి ఎగువపల్లెలో ఆదివారం కోతి దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. గుమ్మాళ్ల వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా కోతి లోపలికి వచ్చి ఆమె తలపై దాడి చేసి గాయపర్చింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

సిద్ధవటం, న్యూస్‌టుడే : మండలంలోని టక్కోలు పరిధి డేగనవాండ్లపల్లె గ్రామ శివారులోని పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సిద్ధవటం ఎస్సై చిరంజీవి తెలిపారు. నలుగురు ట్రాక్టర్ల యజమానులు, మరో నలుగురు చోదకులపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

పర్యాటకాభివృద్ధికి కృషి ప్రశంసనీయం

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: జిల్లా పర్యాటకరంగ అభివృద్ధికి బాలగొండ గంగాధర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి కొనియాడారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ పర్యాటకశాఖ రాష్ట్ర స్థాయి ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా ఆదివారం నగరంలోని సీపీ బ్రౌన్ కేంద్రంలో ఇంటాక్, రాయలసీమ టూరిజం సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం గండికోటను ఒక గాడిలో పెట్టగలిగామని, అక్కడ మరిన్ని వసతులు చేకూర్చగలిగితే యునెస్కో గుర్తింపు సాధించవచ్చన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఎస్.రమునాథరెడ్డి, ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ సంస్థ కార్యదర్శి కె.జనార్దనరాజు, చీఫ్ ఫ్యాట్రన్ వెంకట్రామిరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, వైవీయూ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఇంటాక్, రాయలసీమ టూరిజం సంస్థ ప్రతినిధులు

నిరంతర వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నిరంతరం వ్యాయామం చేస్తే మన ఆరోగ్యం పది కాలాల పాటు పదిలంగా ఉంటుందని డాక్టరు ఎస్.వి.నవీన్ ప్రసాద్ పేర్కొన్నారు. కడప నగరం ఎర్రముక్కపల్లికి చెందిన ఎస్.వి.నవీన్ న్యూరో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒంటిమిట్ట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

దివ్యాంగులకు దాతలు చేయూతనందించాలి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : దివ్యాంగులకు దాతలు చేయూతనందించాలని పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి కోరారు. పులివెందుల పట్టణంలోని వివిధ్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఆదివారం వేముల మాజీ ఉపసర్పంచు ఓటికుంటనాయుడు వర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు రూ.50వేల విలువైన నిత్యావసర సరకులను

దివ్యాంగురాలికి నిత్యావసర సరకులు అందజేస్తున్న సీఐ హాజీవల్లి

సీఐ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచికి, మానవత్వానికి నాయుడు మారుపేరుగా నిలిచారన్నారు. దివ్యాంగుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నాయుడు చిన్నకుమారుడు ఓజియన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఓటికుంట గంగాధర్‌నాయుడు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, నాయుడు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

స్వాగతం.. సుస్వాగతం
గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులుగా బాధ్యతలు స్వీకరించి నేడు కడపలో Inauguration of Cathlab at Super Speciality Hospital ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారికి మా హృదయపూర్వక స్వాగత - సుమాంజలులు.
ప్రిన్సిపాల్ మరియు వైద్య సిబ్బంది
గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, కడప.

స్వాగతం.. సుస్వాగతం
గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులుగా బాధ్యతలు స్వీకరించి నేడు కడపలో Inauguration of Mini Auditorium, Equipment in Central Lab at Govt. Dental College & Hospital, Cathlab at Super Speciality Hospital ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారికి మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు.
సూపరింటెండెంట్ & వైద్య సిబ్బంది
గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, రిమ్స్, కడప.

పదవీ విరమణ శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ చేయుచున్న మా నాన్న గారు శ్రీ పి.వెంకట సుబ్బయ్య కు శుభాకాంక్షలు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ...
శ్రీ పి.వెంకట సుబ్బయ్య, శ్రీమతి పి.గంగమ్మ
A.T.W.O. (FAC), YSR Dist.
కుమారులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు
కుటుంబ సభ్యులు & శ్రేయోభిలాషులు

పదవీ విరమణ శుభాకాంక్షలు
శ్రీ నిమ్మకాయల రాఘవరెడ్డి శ్రీమతి ఉమాదేవి
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, సివిల్, Govt. Polytechnic For Women, Kadapa.
Founder of PALA
అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది నేడు పదవీ విరమణ చేయుచున్న శుభ సందర్భంగా వారికి మా శుభాకాంక్షలు.
ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది కడప.

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సుజన స్కిన్ & హెయిర్ కేర్ క్లినిక్
పాత మునిసిపల్ ఆఫీసు ఎదురుగా, కడప.
గత 20 సంవత్సరాలుగా కడప జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ నేడు 20వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా డా॥ కె.నరోత్తమ్‌రెడ్డి గారికి
DVK Reddy, Madhu Vikram, Sreenivas, Chandu, Managers
DZ Pharma Pvt. Ltd.
Dermazem Division, Bangalore - 562123
డా॥ కె.నరోత్తమ్‌రెడ్డి
M.B.B.S., M.D., (Skin & VD)

మానవతా సంస్థ సేవలు అభినందనీయం

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పేదల అభ్యున్నతికి మానవతా సేవా సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం మానవతా సేవా సంస్థ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు సంస్థ చేయూతనందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఎస్‌ఆర్ కల్యాణమండపం నిర్వాహకుడు సారెడ్డిచంద్రశేఖర్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణ కోసం రూ.25వేల విలువైన వస్త్ర సంచులు వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ కొండారెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి, ఏవీ గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులు ప్రదర్శిస్తున్న పురపాలక కమిషనర్ రాముడు, తదితరులు

200 లీటర్ల సారా స్వాధీనం

లింగాల, న్యూస్‌టుడే : సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పులివెందుల గ్రామీణ సీఐ వెంకటరమణ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాళెంలో సారా కొనుగోలు చేసి విక్రయించేందుకు తీసుకెళుతున్న పులివెందుల నగిరిగుట్టకు చెందిన కావేటి నీలకంఠేశ్వరయ్యను అంబకపల్లె శివార్లలో శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి 200 లీటర్ల సారాతో పాటు ఆటో స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

మారుతీనగర్, న్యూస్‌టుడే: కడప అసెంబ్లీ నియోజవర్గంలో జనసేన బలోపేతానికి అందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా నాయకులు తుంగ రామణయ్య అన్నారు. స్థానిక విశ్వప్రగతి చిట్ ఫండ్ కార్యాలయంలో జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. నగరంలో 50 డివిజన్లలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో జరిగిన అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే మాధవి విచారణ జరుపుతుంటే కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని, వారికి నిజాయతీ ఉంటే నిరూపించుకోవాలి తప్ప ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయకూడదన్నారు. ఉంగరాల విజయ్, సాయి, సిద్ధార్థ్, నాగరాజు, రఘు, కృష్ణ, చార్లెస్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమాని కుటుంబానికి రూ.లక్ష విరాళం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : వైఎస్సార్ జిల్లా కడపలోని అప్సరా థియేటర్‌లో ఈ నెల 27న దేవర సినిమా చూస్తూ గుండెపోటుతో మృతి చెందిన అభిమాని కుటుంబానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు శివశంకర్ ఆదివారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. వైఎస్సార్ జిల్లా సీకేదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన మస్తాన్‌వల్లీ దేవర చిత్రం చూస్తూ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు తొలుత అంత్యక్రియలకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కుటుంబానికి తమవంతుగా రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు.

శ్రీరామ ఎత్తిపోతల నిర్వహణకు నిధులివ్వండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం వార్షిక నిర్వహణకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని నిధులు కేటాయించాలని కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ మాజీ డైరెక్టర్ కె.వెంకటనరసయ్య పేర్కొన్నారు. ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో మూలన చేరిన పథకాన్ని కలెక్టర్ ఆదేశాలతో నీటిపారుదలశాఖ సాంకేతిక నిపుణులు వినియోగంలోకి తీసుకొచ్చారని తెలిపారు. నీటి సరఫరాలో ఒత్తిడితో పైపులైను మళ్లీ పగిలిపోయిందని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు ఈశ్వరయ్య, నరసింహులు, రఘురామిరెడ్డి, కృష్ణయ్య, బాలమునెయ్య పాల్గొన్నారు.

స్వాగతం.. సుస్వాగతం
గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులుగా బాధ్యతలు స్వీకరించి నేడు కడపలో Inauguration of Cathlab at Super Speciality Hospital ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారికి మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు.
రిమ్స్ సిబ్బంది, కడప.

పదవీ విరమణ శుభాకాంక్షలు
వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు (30-09-2024) పదవీ విరమణ చేయుచున్న శ్రీమతి ప్రభావతి దేవి గారికి పదవీ విరమణ శుభాకాంక్షలు.
P.C.J.V. ప్రభావతి దేవి గారు
ప్రిన్సిపాల్, ఎ.పీ. రెసిడెన్షియల్ స్కూల్, మైలవరం.
భర్త : జి.రామచంద్రారెడ్డి, రిటైర్డ్ టీచర్
కూతురు : భూమిరెడ్డి మీనా
అల్లుడు : జి.హరినాథరెడ్డి, Sub-Inspector - ACB
మనువడు : జి.చరిత్‌రెడ్డి, భూమిరెడ్డి కాంప్లెక్స్, జమ్మలమడుగు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ పీవో కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో కడప, పులివెందుల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్న 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కడప-పులివెందుల రహదారిపై మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ★ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 పీవో శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి చంద్ర ఓబుల్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మీరావల్లి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలను తొలగిస్తున్న వాలంటీర్లు

వైభవంగా నాతీయా మెహఫిల్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : మిలాద్ ఉన్ నబీ మాసోత్సవాలను పురస్కరించుకుని కడప నగరంలోని ఆస్థానా ఏ హుసేనియా పీఠంలో ఆదివారం నాతీయా మెహఫిల్ వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి మహమ్మద్ షాహ్జూద్ హుస్సేని సాహెబ్ మాట్లాడుతూ నాతియా మెహఫిల్ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మతగురువులు, కవులు, మౌల్వీలు, ముఫ్తీలు పాల్గొన్నారు.

దక్షిణ కాలువ గండ్లు పూడ్చివేత

కమలాపురం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు మైలవరం దక్షిణ కాలువకు పడిన గండ్లను తెదేపా నియోజకవర్గ అధ్యక్షుడు చాపాటి ప్రభాకర్‌రెడ్డి రెండు రోజులుగా యంత్రం సాయంతో పూడ్చివేత పనులు చేయిస్తున్నారు. దీంతో నీరు వృథాగా పోకుండా చెరువుకు చేరుతోంది. మైలవరం దక్షిణ కాలువ నుంచి కమలాపురం చెరువుకు అధికారులు నీటిని వదిలారు. నాలుగైదు రోజుల్లో చెరువుకు సమృద్ధిగా నీరు చేరనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సుజన స్కిన్ & హెయిర్ కేర్ క్లినిక్
పాత మునిసిపల్ ఆఫీసు ఎదురుగా, కడప.
గత 20 సం॥రాలుగా కడప జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ నేడు 20వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా డా॥ కె. నరోత్తమ్‌రెడ్డి గారికి 'KLM LABORATORIES Pvt. Ltd.,' తరపున శుభాకాంక్షలు.
డా॥ కె.నరోత్తమ్‌రెడ్డి
M.B.B.S., M.D., (Skin & VD)
KLM LABORATORIES PVT. LTD.
An ISO 9001 : 2008 Certified Company, Kadapa.
(Cosmo and Pedia Division)

స్వాగతం.. సుస్వాగతం
గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రివర్యులుగా బాధ్యతలు స్వీకరించిన కడపకు విచ్చేయుచున్న గౌ॥ శ్రీ సత్యకుమార్ యాదవ్ గారికి మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు.
THE KADAPA DISTRICT CHEMISTS & DRUGGISTS ASSOCIATION
Affiliated to SADDA
Chemist Bhavan, D.No. 38/166-2-B, Near Padmasali Function Hall, Rajampeta Road, Kadapa.
President: T.NARASIMHA MURTHY
Hon'ble President: M.CHANDRA SEKHAR
Secretary: K.VENKATESWARLU
Treasurer: M.SUBBA RAO
Organising Secretary: S.KESAVA REDDY
Proddatur Zone Secretary: K.V.SUBBA RAO
Pulivendula Zone Secretary: M.DINESH KUMAR
Kadapa Zone Secretary: K.SUBBARAO

(c) eenadu